

ఆ వ్యక్తి నడివయసువాడు. కొండమీద గుడిలో దేవుణ్ణి దర్శించుకుని, చేతిలో పూజారి యిచ్చిన ప్రసాదంతో నడిచివచ్చి పై మెట్టు మీద ఒక చల్లని చెట్టు నీడను చూసుకుని కూర్చున్నాడు. ప్రొద్దుటినుంచీ ఎండ నిప్పులు చెరుగుతూ తన ప్రతాపం వెలిగించింది. వెచ్చని గాలి సుళ్లు తిరుగుతూ వీచి అన్ని ప్రాణులచేతా 'ఉసు' రనిపించింది. ఇప్పటికి దూరం నుంచి సముద్రపుగాలి కొద్దిగా తెరలు తెరలుగా వీస్తున్నది. ఉదయం నుంచి ఉక్కతో వెచ్చని గాలితో నీరసించిపోయిన ప్రాణికోటికి, కొద్దిపాటి తేమతో కూడిన ఆ గాలి ప్రాణం పోస్తున్నట్టుగా ఉంది. కొండక్రింద ఉన్నది చిన్న పల్లెటూరు. చుట్టూ కుంకుడు చెట్లతోనూ, వెదరు పొదలతోనూ, మామిడితోటలతోనూ చుట్టబడిఉండి ఎప్పుడూ నిశ్శబ్దంగా ఉంటుంది.

ఆ వ్యక్తి చిన్నతనమంతా ఆ వూరిలోనే గడిచింది. ఎక్కడో చదువుకుని, మరెక్కడో ఉద్యోగం చేస్తూ స్వగ్రామంమీద, పిత్రార్జితమైన ఇంటిమీదా మమకారం వదులుకోలేక, యిప్పటికి, అపురూపంగా లభించే సెలవు సంపాదించుకుని ఎన్నో ఏళ్ల తర్వాత అక్కడికి రాగలిగాడు. అతని చిన్నతనంలో గుడికి యీ మెట్లు లేవు. జనమంతా ఆబాలగోపాలమూ కొండ ఎక్కి వెళ్లి దేవుణ్ణి చూడవలసి వచ్చేది. కొండమీద వెలసి ఉన్న భగవంతుడు, కొండెక్కగలిగిన ఓపికా, సాహసమూ ఉన్నవారికి తప్ప మిగిలినవారికి దుర్లభుడై ఉండేవాడు .... ఇప్పుడీ మెట్లవల్ల ఎంతో కష్టం తప్పింది. అతడు తేలికగా రోజూ మెట్లెక్కి వచ్చి దేవుణ్ణి దర్శించుకుని సాయంకాలంపూట ఆ మెట్లమీద చీకటిపడేదాకా కూర్చుంటున్నాడు కూడా.

ఉదయం నుంచి ఉడికిపోయిన శరీరానికి చల్లని గాలి తగలగానే ప్రాణం లేచి వచ్చినట్టయింది. నిర్మేఘంగా ఉన్న ఆకాశంలో ఠీవిగా ఎగురుతున్న ఖగరాజు వైపూ, కొండక్రింద నిశ్శబ్దంగా ఉన్న వూరివైపూ, చూస్తూ కూర్చున్నాడతడు. ఒక చిన్న పిట్ట చిత్రంగా అరిచి అతని దృష్టినాకర్షించింది. అతడు ముగ్ధుడై చూశాడు. తాను కూర్చునివున్న మెట్టుమీద, తన ప్రక్కన నుంచుని ఉంది ఒక రంగు రంగుల బుల్లిపిట్ట రాగాలు

౭౬ వ పేజీ చూడండి

# కుమ్మరిపురుగు

9వ పేజీ తరువాయి

తీస్తున్నది. అవి మరుక్షణంలో ఎగిరిపోయింది. అయినా అతని చూపు అక్కడి నుంచి మరల లేదు. ఆ పిట్ట వ్రాలిన చోటనే అతని దృష్టి నిలిచిపోయింది. అక్కడ 'కుమ్మరి మల్లన్న' అని ఒక పేరు చెక్కబడి ఉంది. ఆ వ్యక్తికి ఆ పేరు ఎప్పుడో విన్నట్టే తోచింది. అతడు అనిమిష నయనాలతో ఆపేరు వంకనే చూస్తూ కూర్చున్నాడు. తర్వాత కొన్ని నిముషాలకే దిగంతాల నుంచి అలలు అలలుగా వీస్తున్న గాలికి జోకొట్టినట్టు కాగా అతని కళ్ళు మూతలు పడ్డాయి.

* * *

ఎన్నోయేళ్ల క్రిందట, ఒకనాడు ....

కుమ్మరి మల్లన్న, గుమ్మంలో కూర్చుని కళ్ల నీళ్లు పెట్టుకుంటున్న భార్య నుద్దేశించి "నిన్న పలు యివాళ సోది యెవరు చెప్పించుకోమన్నారు? చేరెడు బియ్యమూ పోసి సోది చెప్పించుకుని ఏడుస్తూ కూర్చుంటే యీపూట తిండిమాటేమిటి ? లేచి నాలుగు గింజలు పొయ్యిమీద పెట్టు. అయినవాటన్నిటికీ, ఏడుస్తూ కూర్చుంటే కావలసిన పనులన్నీ ఏం కావాలి ? లేలే. ఏది ఏమయినా మనం యింకా బ్రతికిఉన్నాం కనక తినక తప్పదు" అన్నాడు. అతని మాటలు విని ఆమె గాజుబిళ్లల వంటి కళ్లను తుడుచుకుని లేచి లోపలికి వెళ్లింది. మల్లన్న పంచె ఎగగట్టి సారె ముందు కూర్చుని "ఏమిటో వెధవ బ్రతుకులు" అని సణుగుతూ పని ప్రారంభించాడు.

ఇంతకూ ఆనాడు జరిగిన విషయం చాలా సామాన్యమైనది. ప్రొద్దున్నే కరణంగారు పిలువ నంపితే మల్లన్న పది నిముషాలపాటు యిల్లు విడిచి వెళ్లవలసి వచ్చింది. అత డింటికి వచ్చేసరికి అతని భార్య సోది చెప్పించుకుంటున్నది. అందులో అంతా, రెండేళ్లక్రితం చచ్చిపోయిన తమ కొడుకును గురించిన వివరమే వచ్చింది. మల్లన్న భార్య వింటూ దుఃఖం ఆపుకోలేక పోయింది. మాటిమాటికీ కళ్లు తుడుచుకుంటున్నది. అంతా అయిన తర్వాత ఆమె దుఃఖం కట్టలు త్రెంచుకుని ప్రవహించింది. 'నన్నిలా అన్యాయం చేసి పోయావా, నాయనా ?' అంటూ ఏడుస్తూ కూర్చున్నది. మల్లన్న చలించి పోయాడు. అతన్ని కూడా ఆ దుఃఖం అప్పుడప్పుడు తలక్రిందులు చేస్తూనే ఉంది. చేతికంది వచ్చిన కొడుకు హఠాత్తుగా అకాలమృత్యువు పాలబడ్డాడు. అలా చెట్టంత కొడుకును పోగొట్టుకున్న మల్లన్న నడుం విరిగిపోయినట్లయింది. అయినా కాలంకన్నా బాధల గాయాలను మాన్పగలిగిన మందు సృష్టిలోనే లేదు. ఆ దుఃఖం, ఉండి ఉండి పడే వానజల్లు వలె, పూర్తిగా వదలిపెట్టకపోయినా అతడు క్రమంగా తేరుకున్నట్టే. కాని అతని భార్య అసలే బలహీనురాలు. ఆమెను కొడుకు చావు పూర్తిగా క్రుంగదీసింది. ఇప్పటికీ అతడు కలలో కనుపించాడనో, ఎవరిలోనైనా అతని పోలికలు కనుపించాయనో అతన్ని జ్ఞాపకం చేసుకుని దాదాపు రోజూ దుఃఖిస్తూనే ఉంటుంది.

మల్లన్న వేగంగా తిరుగుతున్న సారె ముందు కూర్చుని పని ప్రారంభించాడు. అది ఊరికి చివరి యిల్లు. ఆ యింటి ఉత్తరంవైపు ఒక మామిడి తోట ఉంది. మల్లన్న పని చేసుకుంటూ కూర్చునే చోటి నుంచి చూస్తే ఎదురుగా ఆ మామిడి తోటా, కుడిప్రక్కగా వెదురు పొదలూ, వాటి మధ్య ఒక కాలిబాటా కనిపిస్తాయి. పంచలో నుంచి చేరెడు ఆకాశం కనిపిస్తుంది. అతనికి పూళ్లో పంటల సమయంలో 'ఇంటి కింత' అని గింజలు కొలుస్తారు. పనిఉన్న రోజులలో అతడు తిండీ, తిప్పలూ కూడా మాని ఒళ్లు వంచి పని చేస్తాడు. లేని సమయాలలో 'గిరగిర' తిరిగే ఆ సారె పక్కనే కూర్చుని సోమరిగా మామిడి తోట వంకా, వెదురుపొదల మధ్య కొంతదూరం వంకరగా పోగి తర్వాత కనిపించని కాలిబాట వంకా చూస్తూ ఉండేవాడు. ఏవేవో పక్షులు చిత్రంగా అరుస్తూ అతన్ని ఆకర్షించేవి. పంచలో కూర్చుంటే అతనికి కనుపించే ఆకాశ భాగంలో ఒక్కొక్క డేగ నెమ్మదిగా ఎగురుతూ ఉండేది. రంగు రంగుల మబ్బులతో ఆకాశం పసిపిల్లవాడు రంగులు పులిమిన కాగితం వలె ఉండేది.

దీక్షగా పనిలో నిమగ్నుడై ఉన్న మల్లన్న చూపు అతని ప్రక్కనే ఉన్న బురదమీద పడింది. అతడు ఒక్క నిముషంసేపు పని మాని అటే చూస్తూ కూర్చున్నాడు. తాను కుండలకుగాను కలుపుకున్న మట్టి పక్కనే, ఎందుకూ పనికిరాని బురదమట్టి కొంత మిగిలిపోయింది. ఆ బురదలో ఒక కుమ్మరి పురుగు తిరుగుతున్నది. అది మట్టిని తొలుచుకుని లోపలికి పోతూ మళ్లీ పైకి వస్తూ హడావిడిగా తిరుగుతున్నది. మల్లన్నకు చిత్ర మనిపించింది. ఆ కుమ్మరిపురుగు బురదలోనే తిరుగుతూ ఉంటుంది కాని దాని వొంటికి రవ్వంత అయినా ఆ వంకం అంటుకోదు. ఎన్నోసార్లు మల్లన్న యిలా కుమ్మరి పురుగులను బురదలో తిరుగుతూ ఉండగా చూశాడు కాని యీ విషయం ఎప్పుడూ గమనించలేదు.

అతడు మళ్లీ పని ప్రారంభించాడు. అతడు ఎన్నో యేళ్ళుగా ఆపనికి అలవాటు పడినందువల్ల అతని చేతులు యాంత్రికంగా పనిచేసుకుపోయేవి. అతని మనసు మాత్రం గతాన్ని నెమరు వేసుకుంటూ, ఏవేవో విషయాలను జ్ఞాపకం చేసుకొంటూ తన పనిమీద తాను ఉండేది. ఇంత జీవితంలోనూ అతడు మాటిమాటికీ జ్ఞాపకం చేసుకొనగోరే మనోహరమైన సంఘటనలు కొన్ని మాత్రమే ఉన్నాయి. అతడు వీలుచిక్కినప్పుడల్లా వాటినే జ్ఞాపకం చేసుకుని ఆనందిస్తూ ఉంటాడు. ప్రశాంత ప్రవాహంవంటి అతని జీవితంలో రెండు మూడు సంఘటనలు మరుపు రానివి, జ్ఞాపకం చేసుకున్నప్పుడల్లా ఆనందం కలిగించేవీనూ.

అత డప్పటికి యిరవై రెండేండ్లవాడు. తనకు పిత్రార్జితంగా సంక్రమించిన కుమ్మరి సారె ముందు కూర్చుని మట్టితో పని చేయటంలో అప్పటికే నిష్ణాతుడైనాడు. అత డొకనాడు తన పూరికి పదిమైళ్ల దూరంలో ఉన్న రైలు స్టేషనుకు వెళ్లవలసి వచ్చింది. ఆ స్టేషను చాలా చిన్నది. చుట్టూ చాలా గ్రామా లున్నాయి కాని స్టేషనుకు దగ్గరలో ఏ వూరూ లేదు. అత డక్కడికి వెళ్లేసరికి చీకటి పడుతున్నది. స్టేషను వెనుకవైపు చిన్న హాలులో దీపం వెలుగుతున్నది. సాయంకాలంనుంచి మబ్బులు క్రమ్మిఉండి అప్పుడప్పుడు, విరబూచిఉన్న మల్లెపొదను దులిపినట్టు, సన్నని జల్లు పడుతున్నది. ప్రయాణికులు కూర్చునే హాలులో బల్లమీద ఒక యువకుడు కూర్చుని ఉన్నాడు. క్రింద ఒక పెట్టెమీద పదహారుఏళ్ల యీడుగల పిల్ల కూర్చుని ఉంది. ఆ యువకుడు దబ్బపండు చాయలో ఉన్నాడు. ఆపిల్ల ఒంటిమీద బంగారాన్ని కూడా గుర్తుపట్టడం కష్టం. ఆ యువకుడు తెల్లని పంచె కట్టుకుని సిల్కు లాల్చీ తొడుక్కుని ఉన్నాడు. ఆమె చింతచిగురురంగులో ఉన్న పట్టు చీరె కట్టుకుని ఉంది. ఆమె జడ బలమైన నల్లత్రాచువలె ఉంది. తలలో పన్నజాజులు చెండు వుంది. ఆమె కాళ్లకు పసుపు ఉంది. వా రిద్దరూ ఉండి ఉండి బెరుకు బెరుగ్గా ఒకరివైపు మరొకరు చూసుకుంటున్నారు. ఒకరికి తెలియకుండా మరొకరు పరస్పరం చూసుకోవాలని ప్రయత్నంచేసి చూపులు కలుసుకోగానే కళ్ళు తిప్పుకుంటున్నారు. మల్లన్న అచేతనంగా హాలు మెట్లమీద నిలబడి చూశాడు. అతడు కనురెప్ప వెయ్యకుండా అలా ఎంతసేపు నుంచున్నాడో తెలియదు. మరొక వ్యక్తి చేతిలో టిక్కెట్లతో లోపలికి వచ్చేదాకా అతనిలో కదలిక లేదు. ఆ సవ్వడి విని అతడీ లోకంలోకి వచ్చాడు. తర్వాత అతడు కొన్ని విషయాలు తెలుసుకున్నాడు. టిక్కెట్లు కొనుక్కుని వచ్చిన వ్యక్తి ఆ పిల్ల తండ్రి. ఆ యువకుడికి మామగారు. ఆయన ఆ స్టేషనుకు ఆరుమైళ్ల దూరంలో ఉండే వూళ్ళో

మొదటివాడు:- ఏమండీ, నేను ఒక పెద్ద మనిషికి అప్పు ఇచ్చాననుకోండి. అతను నాకు ఎన్నాళ్లైనా తిరిగి ఇవ్వలేదనుకోండి. అతగాడిని ఏమనుకోవాలండీ ?

రెండవవాడు:- ఏముందండీ, క్రితం జన్మలో మీరు అతనికి బాకీ అనుకోవాలి. లేదా వచ్చే జన్మలో మీరు అతనిదగ్గర అప్పు తీసుకొని ఎగవేయాలి; అంతే !

కొల్లా సాంబశివరావు (గుంటూరు)

ఐదివంతులు. ఆయన భార్య ఆపిల్ల చిన్నతనంలోనే చనిపోయింది. ఆయన ఎంతో శ్రమపడి తనే తల్లీ తండ్రీ అయి, ఆ పిల్లమీదనే పంచప్రాణాలూ పెట్టుకుని, పెంచి పెద్దదాన్ని చేసి ఒక అయ్య చేతిలో పెట్టాడు. ఇప్పుడామెను అత్తవారి యింటికి పంపిస్తున్నాడు. ఆయన ప్రతి కదలికలోనూ, మాటలోనూ, కూతురిని ఎడబాయ వలసి వచ్చిందనే దిగులూ, వారి అన్యోన్యతను చూసి పొందే సంతోషమూ కనిపిస్తున్నాయి. మల్లన్న అప్పుడప్పుడు తన వూళ్లో విన్న హరికథలలో విష్ణుమూర్తీ, లక్ష్మీ, శివుడూ, పార్వతీ మొదలైన పురాణ దంపతులను గురించి విని ఉన్నాడు. అతనికి యీ దంపతు లిద్దరూ కూడా అటువంటి పురాణదంపతులనే భావం ఎందుకో కలిగింది. వారిలో ఒకరికి మరొకరిమీద తప్ప దేని మీదా ధ్యాస లేదు. వారు ఒకరికోసమే మరొకరు పుట్టినట్టున్నారు. ఇద్దరూ దేవతలవలె ఉన్నారు. స్వచ్ఛంగా, నిర్మలంగా ఉన్నారు. అటువంటి జంటను మల్లన్న ఎన్నడూ చూడలేదు. తనూ ఉన్నాడు. క్షుద్రుడు. మట్టిలో బ్రతికేవాడు.

ఆ తర్వాత కొన్ని సంవత్సరాలకు అతనికి తన పనిమీద విసుగు పుట్టింది. 'ఎంతసేపటికీ యీ చిన్నవూరూ, తోటలూ, గుడీ, తప్ప తనకు మరేమీ తెలియదు. ఇంకా ఎంతో ప్రపంచం ఉంది. ఎన్నో ప్రదేశాలు చూడాలి. ఎన్నో పనులు చెయ్యాలి. ఈ బురదపని చేస్తే తనకు ఒరిగే దేమీ లేదు' అనుకున్నాడు. తన కెవరూ లేరు కాబట్టి తనెలా చేసినా ఎవరికీ ఏమీ నష్టంలేదు. అందువల్ల అతడు ఒకనాటి రాత్రి తన దగ్గర ఉన్న డబ్బు తీసుకుని చిన్న చేతి సంచితో రైలెక్కాడు. రైలు వెళ్లినంత దూరమూ వెళ్లాడు. అక్కడ దిగితే అతని కంతా అగోమయంగా తోచింది. ఆ భాష అతనికి తెలియదు. తన భాష అక్కడివారికి తెలియదు. అతడు అనిశ్చితంగా కొన్నాళ్లు తిరిగాడు. చేసేందుకు పనేమీ కనిపించలేదు. చేతిలో ఉన్న డబ్బేమో హారతి కర్పూరం వలె హరించుకుపోయింది. ఒకనాడు ఆకలితో తిరుగుతూ ఉండగా ఒక తెల్ల దొర అతన్ని 'ఎవరో కూలీ' అనుకుని, పిలిచి 'సూట్‌కేసు' తీసుకురమ్మన్నాడు. మల్లన్నకు అతని మాటలు అర్థం కాకపోయినా, సూట్‌కేసును తీసుకు రమ్మన్నంత వరకు అర్థమయింది. ముట్టుకుంటే మాసిపోయేట్టు తళతళ మెరుస్తున్న ఆ తోలు పెట్టెను, చేతులు తుడుచుకుని భద్రంగా భుజంమీద ఉంచుకుని ఆ దొర వెంట నడిచాడు. అక్కడికి చేరుకుని ఆ దొర ఒక బేడ బిళ్ల యివ్వబోగా అతడు తల త్రిప్పి "నా కేదైనా పని యిప్పించండి. మీకు దణ్ణం పెడతాను" అన్నాడు, చేతులు జోడించి. ఆ దొరకు ఏమీ అర్థంకాలేదు. కాస్సేపు ప్రయాసపడి చివరకు ఒక తెలుగు సిపాయి ద్వారా మల్లన్న చెప్పే విషయం అర్థం చేసుకున్నాడు. తర్వాత ఒక్క క్షణం ఆలోచించి మల్లన్న వంక నిశ్చలంగా చూసి తనవెంట రమ్మని సైగ చేసి లోపలికి నడిచాడు. ఆ దొర జైళ్ల అధికారి. మల్లన్నకు అపూటే ఉద్యోగం దొరికింది. నేరస్థులను బంధించి ఉంచిన గదుల ముందు పహరా వెయ్యటం అతని పని. ముందు కొన్నాళ్లపాటు 'ట్రెయినింగ్' అయితే చాలు. మల్లన్న ఉప్పొంగిపోయాడు. అతనికి 'తళతళ' మెరిసే గుండీలు గల 'డ్రెస్సు' యిచ్చారు. తర్వాత కొద్ది రోజులకే అతని చేతికి తుపాకీ వచ్చింది. అతని ఉద్యోగం ప్రారంభమైన కొద్ది నెలలకు ఒక విశేషం జరిగింది. ఒకనాడు తెల్ల అధికారులు ఒక ముప్పయి యేళ్ల యువకుణ్ణి పట్టి తెచ్చారు. అతన్ని గురించి అక్కడివారందరూ చెప్పుకోవటం విన్నాడు మల్లన్న. అప్పటికి శ్వేతప్రభుత్వానికి వ్యతిరేకత దేశంలో బాగా పెరిగిపోయింది. ఈ పరాయి ప్రభుత్వాన్ని గద్దె దింపితే తప్ప దేశానికి క్షేమం లేదని భారతీయు లందరూ గుర్తించారు. ఆ యువకుడు తనవంటి కొంత మందిని చేరదీసి వారిని ప్రబోధించి, తన స్వల్ప బలంతోనే తన కందుబాటులో ఉన్న శ్వేత అధికారులను హడలగొట్టాడు. కాని విధి ప్రతికూలంగా వ్యవహరించినందువల్ల అతని ప్రయత్నాలు ఫలించలేదు. పైగా కొత్త నాయకులలో చాలా మందికి హింసాయుతపద్ధతులలో ఉద్యమం సాగించటం యిష్టంలేదు. జనతలో అటువంటి వారికే పలుకుబడి ఎక్కువగా ఉంది కూడా. అతని తోటి యువకులలో చాలామంది చిన్న చిన్న పోరాటాలలో మరణించారు. మరికొంతమందికి బలమైన గాయాలు తగిలాయి. అతడు నిస్సహాయుడైనాడు. అంగబలమూ, అర్థబలమూ, తనతోటివారల సానుభూతీ కూడా కరువైపోగా కోరలు పీకిన సింహం వలె అతడు కూడా పట్టుబడిపోయాడు. ఆ చివరి పోరాటంలో అతని చేతికి గాయం అయింది. తెల్లవారితే ఆ యువకుణ్ణి కాల్చివేయమని ఉత్తరువులు వచ్చాయి. ఆనాటి రాత్రి మల్లన్న అతడున్న గదిముందు పహరా కాయవలసి వచ్చింది. చేతిలో తుపాకీతో మల్లన్న అటూ యిటూ తిరగటం ప్రారంభించాడు. కటకటాల కవతల గదిలో ఆ యువకుడు వేదో ప్రార్థన చేసుకుంటున్నాడు. అది బహుశా దేవభాష అయి ఉంటుంది. ప్రార్థన కాగానే అతడు గడ్డిమీద పడుకున్నాడు. సన్నని దీపపు వెలుగు అతని ముఖం మీద పడుతున్నది. అతడు పచ్చనివాడు. అజానుబాహువు. నిరంతర వ్యాయామంవలన కండలు తిరిగిన శరీరం కలవాడు. అతని గడ్డం పెరిగి ఉంది. అయినా ముఖంలో అసామాన్యమైన తేజస్సు ఉట్టిపడుతున్నది. మల్లన్న కూర్చుని మళ్లీ అటే చూశాడు. తర్వాత చూపులను మరల్చుకో లేకపోయాడు.

ఆ యువకుణ్ణి తెల్లవారిన వెంటనే తెల్లవారు నిర్దాక్షిణ్యంగా కాల్చివేస్తారు. నిండైన జీవితం గడపవలసిన ఆ యువకుడు మరికొన్ని గంటలలో యిక ఉండడు. మల్లన్న అనుకున్నాడు: 'ఆ యువకుడూ, తనూ, ఒకే దేశానికి చెందినవారు. పరాయి ప్రభుత్వాన్ని కూలద్రోయడానికి అతడు ఉద్యమం లేవదీశాడు. కాలం కలిసిరాక పట్టుబడిపోయాడు. అతన్ని ప్రభుత్వం అంతం చేస్తున్నది. తనేమో అతనికి కావలా! తెల్లవారగానే తాను తలుపులు తీసి, అతన్ని వెంటబెట్టుకుని వెళ్లి కాల్చివేసే వారికి అప్పజెప్పాలి. వారు కాల్చివేయగానే శవాన్ని యిద్దరు మనుష్యుల సహాయంతో తీసుకుపోయి జైలు బయట కావలసినవా రెవరైనా ఉంటే అప్పగించవచ్చు. ఎవరూ లేకపోతే పూడ్చించివేయాలి ...' ఆలోచిస్తున్నకొద్దీ మల్లన్న ముఖం అవమానంతో కందగడ్డ అయిపోయింది. అతడు తెల్లవార్లూ అలాగే కన్ను రెప్ప వెయ్యకుండా ఆ యువకుడి ముఖం వంకనే చూస్తూ లోలోపలే క్షోభించిపోయాడు. తెల్లవారి తాళం తీయగానే ఆ యువకుడు లేచి మోకాళ్లమీద కూర్చుని ఒక్క నిముషంసేపు ప్రార్థన చేశాడు. తర్వాత లేచి నిలబడి మల్లన్న వంక నవ్వుతూ చూసి 'పద' మని సంజ్ఞ చేశాడు. మల్లన్నకు కళ్లనీళ్ల పర్యంతమైంది. అతడు నిశ్శబ్దంగా వెలుపలికి నడిచాడు. బయట మరొక 'సెంట్రీ' ఉన్నాడు. ఇద్దరూ ఆ యువకుణ్ణి తమ మధ్య నడిపిస్తూ 'బలిపీఠం' దగ్గరికి తీసుకువెళ్లారు. అక్కడ అంతా సిద్ధంగా ఉన్నారు. తర్వాత కొద్ది క్షణాలకే అతడు తుపాకీ కాల్పులకు గురియై ఒరిగిపోతూ, 'ఇంక్విలాబ్ జిందాబాద్, వందే మాతరమ్' అని అరవటం, కళ్లు మూసుకుని నిలబడిఉన్న మల్లన్నకు వినిపించింది. అతడు ఆ యువకుడి శవాన్ని యిద్దరు మనుష్యులు మోసుకుపోతూ ఉండగా, వెంబడి నడిచాడు. అతనికి తన చిన్నతనంలో తన వూళ్లో ఒకాయన చెప్పిన విషయం గుర్తుకు వచ్చింది. 'గొప్పవాళ్లూ గొప్పపనులకోసం ప్రాణత్యాగం చేసినవాళ్లూ నక్షత్రా లవుతారు' అని చెప్పాడాయన. మల్లన్న తల పంకించి 'అవును. ఇతడు కూడా నక్షత్రం అవుతాడు' అనుకున్నాడు. ఆ రాత్రి ఆరుబయట మంచుని ఆకాశంలోకి చూస్తున్న మల్లన్న కళ్లకు ఉత్తరదిశగా ఒక కొత్త నక్షత్రం కనుపించింది. అది మిగిలిన మామూలు నక్షత్రాల వలె మిలమిల మెరవటం లేదు అది ఎర్రగా కెంపు వలె, ఆ యువకుడి చేతి గాయం నుంచి స్రవించిన నెత్తురు రంగోలి

వచ్చే వారం

ముఖచిత్రం

వ్యాసం!




## మీ సొమ్మునకు మేలైన విలువ




మీరు కొనుటకు వెచ్చించిన సొమ్ములోని ప్రతి రూపాయికి ప్రతిఫలముగా మీకు నెలలకుతరబడి శ్రమనీయక, అధిక కాలం పని చేసే బ్యాటరీయే సరసమైన ధరగల బ్యాటరీ. ఈ పనినే నమ్మకంగా చేసేది సిల్వర్ ఎక్సైడ్ బ్యాటరీ. తయారీలో నిశితమైనపరీక్షలకు గురిచేయబడినది గాన, ఎక్కువ శక్తి నిల్వచేసి, శక్తివంతంగా పనిచేయునట్లు నిర్మింపబడినది.

* అధిక కాలం మనగల సి బి 95 అలాయి ప్లేట్లు
* సామాన్యంగా చెడిపోని ఫోర్వెక్ సెపరేటర్లు
* తాకిడికి తట్టుకొనగల గట్టి రబ్బరు కంటెయినర్లు

ఇతర బ్యాటరీలు నిల్చినా ఇదిమాత్రం ఇంకా పనిచేస్తూంది

## సిల్వర్ ఎక్సైడ్

క్లోరైడ్ & ఎక్సైడ్ బ్యాటరీ (ఈస్టర్న్) ప్రైవేట్ లిమిటెడ్. EBSC 21

మద్రాసు, ఆంధ్ర, కేరళ మైసూరు రాష్ట్రములకు ప్రధాన ఏజంట్లు:
జనరల్ ఎలెక్ట్రిక్ కంపెనీ ఆఫ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, మద్రాసు-2.
బ్రాంచీలు: కోయంబత్తూరు, బెంగుళూరు, సికింద్రాబాదు.


## కుమ్మరి పురుగు

ఉంది. మల్లన్న 'నేను క్షుద్రుణ్ణి. మట్టిలో బ్రతకవలసిన వాణ్ణి' అనుకున్నాడు.

తర్వాత రెండు మూడు రోజులకే అతడు తనకు ఉద్యోగం యిప్పించిన దొర దగ్గరకు వెళ్ళి సలాంచేసి "నే నింక యీపని చెయ్యను మా ఊరికి వెళ్ళిపోతాను" అన్నాడు. దొర ముందు ఆశ్చర్యపోయి తర్వాత "సరే" అని అతని రాజీనామాను అంగీకరించాడు. మల్లన్న పెట్టె బేడా సర్దుకుని ఉద్యోగాన్నీ, ఆ ప్రాంతాలనూ ఒదిలి తన స్వగ్రామం వచ్చేశాడు. వూళ్ళో తన పెద్దలు కట్టించిన యిల్లు కూలిపోబోతూ ఉంటే, తన దగ్గర ఉన్న డబ్బులో కొంత ఖర్చుచేసి దాన్ని బాగు చేయించాడు. తర్వాత మళ్ళీ గిరగిర తిరిగే కుమ్మరిసారె ముందు అతని జీవితం ప్రారంభమైంది. అతని దూరపు బంధువు లెవరో శ్రద్ధ తీసుకొని అతడు మళ్ళీ ఎటూ దేశంమీదికి పోయేందుకు వీలు లేకుండా పెళ్ళిచేసి ఒక యింటివాణ్ణి చేశారు.

అతనికి పెళ్ళి అయిన రెండేళ్ళకు దేశానికి స్వాతంత్ర్యం వచ్చింది. ఎన్నో వందల యేళ్ళుగా దేశసంపద నంతటినీ కొల్లగొట్టిన పరాయి ప్రభుత్వం 'ఈ జాతి జాగరితమైంది. ఇక మన ఆట రిక్కడ సాగవు' అనుకుని చల్లగా తప్పుకున్నది. మల్లన్న ఒకనాడు గుడికి వెళ్ళి తిరిగి వస్తుండగా కరణంగారి పాలేరు శేషు అతణ్ణి పలకరించి "రేపు రైల్లో గాంధిగా రొస్తున్నా రంట! కరణంగారి యింటిల్లిపాదీ ఎద్దులబండ్లో 'టేషను' కాడి కెళ్తారు. నువ్వూ రారాదూ, సూద్దువుగాని?" అన్నాడు. మల్లన్న ఆ పేరు సింతకుముందు విని ఉన్నాడు. మనిషి ఎంత బక్కవాడో ఆయన సంకల్పం అంత వజ్ర సన్నిభమైనదనీ, అటువంటి సంకల్పబలంతోనే నిద్రాణమైవున్న జాతిలోని స్వాతంత్ర్యకాంక్షను ఉద్దీపింపజేసి ప్రభుత్వంవారి తుపాకి గుండ కెదురు నడచిన మహా ధైర్యశాలి అని కూడా విని ఉన్నాడు. అతడు శేషుతో "నేనూ వస్తానురా. బండ్లో నీతో బాటు బల్లలో కూర్చుంటాను" అన్నాడు. శేషు తల వూపి 'సరే' నన్నాడు. మర్నాడు స్టేషను దగ్గర చుట్టుపక్కల వూళ్ళనుంచి చాలామంది జనం చేరారు. జాతి పితకు స్వాగతం చెప్పేందుకు ఖద్దరునూలు దండలూ, వూలమాలలూ సిద్ధం చేసుకుని ఉన్నారు. దాదాపు పదకొండు గంటల వేళకు బండి వచ్చి ఆగింది. జనంలో త్రొక్కిడి ఎక్కువైంది. అందరూ కేకలు వేస్తున్నారు. ఆయన ఏ పెట్టెలో ఉన్నాడో తెలియక జనం తికమకపడి అటూ యిటూ పరుగులెత్తారు. మల్లన్న ఎటూ కదలకుండా నిలబడి ఒక పెట్టె కమ్ములు పట్టుకుని జనం తనను తొక్కివెయ్యకుండా తప్పుకున్నాడు. అకస్మాత్తుగా అతడు ఉన్న చోటనే తలుపు తెరుచుకుంది. చేతిలో కర్రతో మోకాళ్ళ వరకూ ఉన్న అంగవస్త్రంతో, మెడలో ఆ క్రింద స్టేషనులో వేయబడిన పూలమాలలతో, అన్నిటినీ మించి ఎదుటివారిని పరవశులను చేసే బోసి నవ్వుతో, నిలబడ్డాడు బాపూజీ జనం

గుంపుగా కూడి జయజయధ్వానాలు చేశారు. కొందరు మెళ్ళకెక్కి పూలమాలలు వేశారు. కొందరు దూరంనుంచి పూలదండలను విసిరివేశారు. ఆయన అలాగే చిరునవ్వు నవ్వుతూ చేతులను జోడించి జనానికి నమస్కరించాడు. మల్లన్న తల ఆయన పాదాల దగ్గర ఉన్నది. అతడు రైలుపెట్టె కమ్ములను రెంటినీ పట్టుకొని ఉండి, తన చోటు నెవరూ ఆక్రమించు కొనేందుకు వీలులేకుండా నిలబడి, ఆయన వంక కన్నార్పకుండా చూశాడు. ఇంత సన్నని మనిషిలో యింత శక్తి ఎక్కడి నుంచి వచ్చింది ? శరీరంలో పిడికెడు మాంసం కూడా లేని యీ మనిషి తుపాకి గుండ్లకు కూడా వెరవకుండా ఇంత మహత్కార్యాన్ని ఎలా సాధించాడు ? చేతిలో ఏ ఆయుధమూ లేకుండా కేవలం తన సంకల్పబలంతోనే అంతటి మహా సామ్రాజ్యాధినేతలను నీరుకారిపోయేట్టు ఎలా చెయ్యగలిగాడు ? ఆయనలో దైవాంశ ఉండి ఉండాలి. 'అవును. ఆయన దైవాంశ సంభూతుడు. నేను క్షుద్రుణ్ణి. మట్టిలో బ్రతకవలసిన వాణ్ణి' అనుకున్నాడు మల్లన్న. అతడు తన కుడిచేతితో ఆయన పాదాన్ని తాకి కళ్ళ కద్దుకున్నాడు. ఆయన ఆ స్పర్శకు తల వంచి, అతని ముఖంలోకి చూసి నవ్వి తన మెడలోని గులాబీ దండ నొకదాన్ని అతని మీదికి విసిరివేశాడు. మల్లన్న శరీరం పులకరించిపోయింది. అతడు పరవశుడై ఆ గులాబీల మాలను అతి జాగ్రత్తగా ఒక రెక్క అయినా రాలిపోకుండా దాచుకుని ఆ జనంలో నుంచి యివతలికి వచ్చాడు. తర్వాత కొద్ది నిముషాలకు జయ జయ నినాదాల మధ్య రైలు కదలిపోయింది. మల్లన్న ఆ దండను యింటికి తెచ్చి తన యింట్లో మట్టి గోడకు వ్రేలాడుతున్న రాముల వారి పటానికి దాన్ని వేసి, తన భార్యతో ఆ వృత్తాంతమంతా గర్వంతో పొంగిపోతూ చెప్పాడు. అది యిప్పటికీ వాడిన రేకులతో అలాగే ఉంది.

మల్లన్న చేస్తున్న పని పూర్తి అయింది. అతడు ఆలోచించవలసిన విషయాలు కూడా పూర్తి అయినయ్. ఆ తర్వాత అతని జీవితం చాలా మామూలుగా గడిచిపోయింది. జ్ఞాపకం చేసుకుని ఆనందించవలసిన సంఘటన లేవీ తర్వాత జరగనేలేదు. అతడు చేతులు కడుక్కుని ఇంట్లోకి వెళ్ళి భోజనం చేసి వాకిట్లోకి వచ్చేసరికి శేషు అరుగుమీద చుట్ట కాల్చుకుంటూ కూర్చుని ఉన్నాడు. మల్లన్న "ఏమిరా శేషూ ? ఏమిటి సంగతులు ?" అని అడుగుతూ అతని ప్రక్కనే కూర్చున్నాడు. శేషు నిట్టూర్చి 'రోజూ ఏముంటయ్‌రా సంగతులు ?' అని, మళ్ళీ అంతలోనే "అన్నట్టు, ఇది విన్నావా ? కరణంగారు గుడికి మెట్లు కొట్టిస్తారట" అన్నాడు.

మల్లన్న ఉత్సాహంతో అన్ని వివరాలూ అడిగి తెలుసుకున్నాడు. ఆవూరి కరణంగారు కొండ మీద ఉన్న గుడికి మెట్లు చెక్కించటంవల్ల అందరికీ గుడి అందుబాటులో ఉంటుందని భావించి, అవసరమైన వారితో సంప్రదించి చందాలు పోగు చేస్తున్నాడట. అయిదు రూపాయలకు తక్కువ కాకుండా ఎవరికి తోచినంత వారు ఈ ధర్మకార్యానికి విరాళా లివ్వాలి. ఆ డబ్బు పెట్టి కొండ మీదికి మెట్లు చెక్కిస్తే తమకే గాక ముందు తరాల వారికి గూడా దైవదర్శనం తేలికయి పోతుంది. అలా ధనసహాయం చేసిన వదాన్యుల పేర్లు మెట్లమీద చెక్కిస్తారు.

ఈ విషయం చెప్పి శేషు వెళ్ళిపోయాడు. మల్లన్న అలాగే కూర్చుని ఆలోచిస్తూ ఉండిపోయాడు. అతనికి అంతవరకూ ఎన్నడూ డబ్బుతో అవసరం రాలేదు. పంటల సమయంలో తమ కిద్దరికి సరిపడ గింజలు వస్తాయి. ఇంటి ప్రక్కన ఆవరణలో కొన్ని కూరపాదు లున్నాయి. ఎప్పుడయినా యితర వస్తువు లేవయినా కావలసి వస్తే గింజలు వేసికోవటం మామూలు. ఇప్పుడు ఎలాగయినా సరే అయిదు రూపాయలు సంపాయించాలి.

---

క్లాసులో పిల్లలంతా, మాష్టారు తన పిలకను మాటిమాటికి సవరించుకొంటుంటే, తెగనవ్వుతున్నారు. అది విన్న మాష్టారు మహాగర్వంగా పిల్లలతో: ఒరేయ్ వెధవల్లారా, నా పిలకనే చూసి నవ్వుతార్రా, నా పిలకసంగతి మీకు తెలియదు. అందులో కరెంటు ఉందిరా కరెంటు, ఆ!

ఆ క్లాసులోనే ఉన్న మాష్టారు కుమార్డు లేచి (అమాయకంగా) "నాన్నా మరి ఆ కరెంటు పెట్టి మనింటికి లైట్లు పెట్టించకూడదు? రోజూ ఇల్లుగలవారితో పోట్లాడక పోతే!"

కొల్లా సాంబశివరావు (గుంటూరు)

---

అతడా మరునాటి నుంచి నాలుగు రోజులు విర్విరామంగా వొంచిన నడుం ఎత్తకుండా పనిచేసి కుండలు తయారుచేశాడు. అన్నీ మామూలు కుండలే కాకుండా కొన్నింటికి చిత్రమైన నగిషీ చెక్కాడు. ఇన్ని యేళ్ళ నుంచి ఆ పనిలో అతనికి లభించిన నైపుణ్యమూ, చేతులలోని పనివాడితనమూ .... అంతా ఉపయోగించి కొన్ని కుండల మీద అద్భుతమైన నగిషీ చెక్కాడు. ఇరవై రోజుల తర్వాత ఆవంలోంచి ఒక్కొక్క కుండనే బయటికి తీస్తూ, జాగ్రత్తగా చూస్తూ, సంతృప్తితో తల వంకిస్తూ, 'బస్తీవాళ్ళు చూస్తే నిముషంలో అమ్ముడుపోవూ' అనుకున్నాడు. అతని కానాడు తన కృషివల్ల కలిగే ఆనందం మాటికి నూరు పాళ్ళూ కలిగింది.

తర్వాత అతడు శేషు దగ్గరికి వెళ్ళి 'ఒరే శేషూ ! మనం ఒకసారి బస్తీకి వెళ్ళి రావాలి. మీ అయ్యగార్ని అడిగి బండీ, ఎడ్లూ వొచ్చేట్టు చూడరా !' అని అడిగాడు. శేషు తాడుపేనుకుంటున్న వాడల్లా, తల పైకెత్తి చూసి, నవ్వి "బస్తీలో నీకేం పని తగిలిందిరా ? ఏదో విశేషం ఉన్నట్టుందే. ఎన్నడూ తిరునాళ్ళకైనా రానివాడివి, నీకు పట్నంలో పనేంటబ్బా ?" అన్నాడు.

మల్లన్న విషయమంతా వివరించి చెప్పి "ఇవి చేతులు కావు కాళ్ళనుకోరా బాబూ ! కాస్త సాయం చెయ్యరా" అన్నాడు. శేషు చుట్టముక్క అవతల పారేసి "అయితే, నాకు తెలియక అడుగుతాను .... నీకు డబ్బెందుకురా ?" అని ప్రశ్నించాడు. మల్లన్న "ఎందుకో ఒకందుకు. ఆ ఆరా లన్నీ నీ కెందుకు ? నాకు కావలసింది అయిదు రూపాయలే. తతిమ్మాదంతా నీకే యిచ్చేస్తాను" అన్నాడు. శేషు ఒక్క క్షణం ఆలోచించి 'సరే' అన్నాడు.

మర్నాడు రాత్రి శేషు యజమాని అనుజ్ఞ తీసుకుని, బండి తోలుకొని మల్లన్న యింటికి వచ్చి కేక వేశాడు. మల్లన్న ఎప్పటిదో పాత చొక్కా ఒకటి తొడుక్కుని సిద్ధంగా ఉన్నాడు. ఇద్దరూ నెమ్మదిగా ఆ కుండలను బండిలో చేర్చి పదిలంగా అమర్చి త్రాళ్ళు వేసి బిగించారు. బండి కుదుపుకు కుండలు దెబ్బతినకుండా జాగ్రత్తగా త్రాళ్ళు కట్టిన తర్వాత శేషు "మనం చాలా జాగ్రత్తగా ఉండాలిరా. ఇవి ఏనుగుల్లాగా ఉన్నాయే గాని పోట్ల బెదురు గొడ్లు. లారీ చప్పుడు వింటే చాలు బెదిరిపోతాయి" అన్నాడు. మల్లన్న తల ఊపి, భార్యను కేకవేసి "తలుపు వేసుకో" అన్నాడు. ఆమె తలుపువేసుకుని లోపలికి వెళ్ళిపోయింది.

ఇద్దరూ ప్రయాణం సాగించారు. బస్తీ దాదాపు పన్నెండు మైళ్ళు ఉంది. అక్కడక్కడ రోడ్డుమీద లారీ వొస్తున్న సవ్వడి వినిపించగానే బండిని పక్కగా ఆపి పగ్గాలు గట్టిగా పట్టుకుని ఆగిపోయేవారు. కళ్ళు మిరుమిట్లు గొలిపే కాంతితో లారీలు తమను దాటిపోగానే అప్పుడు 'అమ్మయ్య' అనుకుని మళ్ళీ బయలుదేరేవారు. ఈవిధంగా ప్రయాణం సాగించి బస్తీ శివార్లలోకి వచ్చేసరికి తూర్పు తెల్లబడుతున్నది. రకరకాల పక్షులు తమ తమ గూళ్లను వదలి ఆహారంకోసం గుంపులు గుంపులుగా ఎగిరి పోతున్నాయి.

బస్తీ శివార్లలో యిద్దరు వ్యక్తులు పళ్ళ సందున వేపపుల్లలతో, నిలబడిఉండి వూళ్ళోకి వచ్చే బండ్లవారి దగ్గర పన్ను వసూలు చేస్తున్నారు. వారు మామూలుగానే కుండలతో నిండి ఉన్న యీ బండిని కూడా ఆపి ఒక చిన్న చీటీ యిచ్చి "మూడణా లివ్వవయ్యా" అన్నారు. మల్లన్న బండి వెనకనుంచి ముందుకు వొచ్చి "ఎందుకూ ? ఇదేం అద్దె బండ్లు కావుగా. బండి మాది. ఎద్దులు మావి. కుండలు మావి. మేము డబ్బెందుకు కట్టాలి ?" అని వాళ్ళతో వాదన వేసుకున్నాడు. "కుండలు అమ్ముకొనేందుకు వొచ్చిన మాట నిజమే. అందుగ్గైతే పన్ను మీరు అడగటమూ, మేము కట్టటమూ సబబుగా ఉంటుంది. అంతేగాని వూరికే బండి లోపలికి వస్తే పన్నెం

# కుమ్మరిపురంగు

...కూ ?" అని నిగ్గదీశాడు. చుట్టూ చేరిన పది మంది తలా ఒకమాటా అని అతన్ని హేళన చేశారు. ఒకడు "ఆ పన్ను అంతే. నువ్వు కట్టక తప్పదు." అన్నాడు. మల్లన్న చిన్నబుచ్చుకున్నాడు. దీనికి తోడు అతని దగ్గర కాని డబ్బు కూడా లేదు. అతడు ఆ వ్యక్తి చేతులు పట్టుకుని "బాబ్బాబు! కాస్త కనికరించు. కుండ లమ్ము కునేందుకు పోతున్నాంగా. సాయంకాలం తిరిగి వచ్చేటప్పుడు తప్పకుండా యిస్తాన్లే. నా దగ్గ రిప్పుడేమీ డబ్బులేదు" అన్నాడు. ఆ వ్యక్తి వికటంగా నవ్వి "మంచివాడివే. నేను పది గంటల కల్లా ఆఫీసులో డబ్బు కట్టాలి. నేను 'తర్వాత యిస్తానంటే' అక్కడ వూరుకోరు" అన్నాడు. శేషు బండిమీద కూర్చుని చేతుల్లో పగ్గాలు గట్టిగా పట్టుకుని ఉండి యిదంతా విని మల్లన్నను పిలిచి "వాళ్లతో వాద నెందుకురా? ఈ పావలా తీసుకుని ముందా ముడుపు చెల్లించుకో, తర్వాత చూసుకోవచ్చు" అన్నాడు ఒక పావలా బిళ్ల తీసి యిస్తూ. మల్లన్న దాన్ని అందుకుని "రక్షించావు" అనుకుని పన్ను కట్టి రశీదు తీసుకున్నాడు.

శేషు పగ్గాలు ఒదిలిపెట్టకుండా చాలా జాగ్రత్తగా నడుపుతున్నాడు బండి. అతనికి మార్కెట్టుకు దారి తెలుసు. ఎద్దులు తెల్లని ఏనుగుల వలె ఠీవిగా నడుస్తున్నాయి. మరి కొద్ది దూరం గడిస్తే మార్కెట్టు చేరుకోగల రనగా పెద్ద దారుణం జరిగిపోయింది. ప్రక్క వీధిలో నుంచి వొస్తున్న లారీ హారను శబ్దం విని ఎడ్లు బెదిరిపోయి, శేషు చేతిలో పగ్గాలు గట్టిగా పట్టుకుని కూర్చుని ఉండటంవల్ల, ఎటూ పరుగెత్తలేక వెనక్కు వెనక్కు నడుస్తూ పోయి బండి నొక పెద్ద ప్రహరీ గోడకు తాకించాయి. వీధిలో జనం వింతగా చూశారు. మల్లన్న పరుగెత్తుకుపోయి చూశాడు. అతని కళ్లలో నీళ్లు తిరిగాయి. ఎర్రనిరంగు వేసి వింత వింత నగిషిలతో తన కున్న నైపుణ్యం అంతా వినియోగించి రాత్రింబగళ్లు శ్రమపడి తయారుచేసిన కుండలన్నీ తప్పు పప్పయి పోయాయి. శేషు పగ్గాలు చక్రానికి వేసి కట్టి వెనక్కు వచ్చి చూశాడు. అతనికి కూడా చాలా మనస్తాపం కలిగింది.

తర్వాత యిద్దరూ అక్కడే కాస్సేపు కూర్చున్నారు. మల్లన్న మోకాళ్ల చుట్టూ చేతులు కట్టుకుని దిగులుగా కూర్చుండిపోయాడు. శేషు కొద్దిసేపు తనలో తనే బాధపడి తర్వాత హఠాత్తుగా శివమెత్తిన వాడివలె లేచి వెళ్లి ఎడ్లను బాదటం ప్రారంభించాడు. మల్లన్న లేచి వెళ్లి అతన్ని ఆపి యివతలికి లాగి, "నోరులేని జంతువులను బాదుకుంటే ఏం లాభం? పాపం! అవేం చేశాయి? మన రాత అలా ఉంది" అన్నాడు.

తర్వాత యిద్దరూ యింటిదోవ పట్టారు. మల్లన్న యింటిముందు ఆగి శేషు "మల్లన్నా! మళ్లీ నెలరోజు లాగిపోదాం లేరా" అన్నాడు. మల్లన్న నిరుత్సాహంగా 'సరే' అన్నాడు. ఆ రాత్రి, మర్నాడు కూడా అతడు నిరుత్సాహంగా గడిపాడు. కాని రెండు రోజులు గడిచేసరికి అతనిలో మళ్లీ పట్టుదల వచ్చింది. అనుకున్న పని అనుకున్నట్టుగా జరిగితే తప్ప తనకు మనశ్శాంతి లేదు. ఇలా ఎన్ని అవాంతరాలూ, అడ్డంకులూ వొచ్చినా సరే తాను అనుకున్న పనిని సాధించి తీరాలి. అప్పు అప్పుడు కాని ప్రశాంతంగా నిద్ర అయినా పట్టదు.

అతడు మళ్లీ పని ప్రారంభించి మునుపటి కన్నా రెండింతలు పట్టుదలతో, దీక్షతో పని చేశాడు. మరొక యిరవై రోజుల తర్వాత మళ్లీ బస్తీకి ప్రయాణ మైనారు. ఈసారి వారి ప్రయాణం సజావుగానే సాగిపోయింది. బస్తీ మార్కెట్టులో మల్లన్న అనుకున్నట్టు నిముషాల మీద అమ్ముడుపోక పోయినా, సాయంకాలం వేళకు కుండలలో సగానికి పైగా చెల్లిపోయాయి. అప్పటికే ఎనిమిది రూపాయల అమ్మకం కనిపించింది. ఇక ఆట్టేసేపు ఉండలేక మిగిలిన కుండలను అక్కడి వారికి టోకుగా యిచ్చి తిరుగుముఖం పట్టారు. డబ్బు అంతా లెక్క పెట్టుకుంటే మొత్తం పదకొండు రూపాయల చిల్లర ఉంది.

మల్లన్న అందులో అయిదు రూపాయలు ఉంచుకుని మిగిలినదంతా శేషు చేతికిచ్చి "ఇదుగో! ఇది నువ్వుంచుకో" అన్నాడు. శేషు "అదేమిట్రా! నా కెందుకూ ?" అని అడిగాడు. మల్లన్న "నా కీ అయిదు రూపాయలూ చాలు. నువ్వు నాతో బాటు కష్టపడ్డావుగా. నువ్వు నీ యజమానిని ఒప్పించి బండి తీసుకు రాకపోతే నా పని అయ్యేది కాదుగా. ఎందుకయినా ఉంటుంది. దగ్గర ఉంచుకో" అన్నాడు. శేషు నవ్వి 'సరే' అంటూ ఆ చిల్లరను తలగుడ్డలో దాచుకున్నాడు.

మల్లన్న ఆ రాత్రి భోజనంచేసి కరణంగారి యింటికి వెళ్లాడు. ఆయన యాభై యేళ్లవాడు. పంచలో కూర్చుని ఉండి పిల్లలచేత ఎక్కాలు వల్లె వేయిస్తున్నాడు. దణ్ణంపెట్టి నుంచున్న మల్లన్నను చూసి గుర్తించి "నువ్వా? ఇలా వొచ్చావేం మల్లన్నా. కూర్చో. ఏమిటి సంగతులు ?" అని అడిగాడు. మల్లన్న పంచలో వొదిగి కూర్చుంటూ "బాబుగారూ! మీరు గుడికి మెట్లు చెక్కిస్తున్నారటగా ?" అని అడిగాడు. కరణంగారు నవ్వి "అవునోయ్! ఆ ఆలోచన రాగానే నలుగురికీ చెబితే 'సరే' నన్నారు. ఎవరికి తోచిన సహాయము వారు చేస్తున్నారు. ఇప్పటికి కొంత డబ్బు ప్రోగయింది కూడా. రేపు దశమినుంచి పని మొదలుపెట్టాలని అనుకుంటున్నాము" అన్నాడు.

మల్లన్న తలగుడ్డలో నుంచి అయిదు రూపాయల చిల్లర తీసి ఆయన ముందుంచి భయభక్తులతో "ఇవి అయిదు రూపాయలు బాబుగారూ! కుండలు కొన్ని పట్నానికి తీసుకుపోయి అమ్మితే వచ్చింది. దీన్ని ఆ డబ్బుతో కలిపి మీకు తోచినట్టు వినియోగం చెయ్యండి." అన్నాడు. కరణంగారు ముగ్ధుడై కాస్సేపు అతని వంక చూసి తర్వాత "అలాగే, చేస్తాను" అంటూ ఆ డబ్బును తీసుకున్నాడు.

మల్లన్న మరేమీ మాటాడలేకపోయాడు. అనుకున్న పని చెయ్యగలిగాననే సంతృప్తితోనూ, సంతోషంతోనూ, అతడు ఉక్కిరిబిక్కి రవుతూ "వొస్తాను బాబుగారూ!" అంటూ మెట్లుదిగి త్వరత్వరగా యింటివైపు నడిచిపోయాడు. కరణంగారు అతడు కనిపించినంతసేపు చూసి తర్వాత యింట్లోకి వెళ్లాడు.

*   *   *

ప్రక్కనే ఒక కాకి 'కావు కావు' మని వేసిన కేకకు మెట్టుమీద కూర్చుని మగతగా నిద్రపోతున్న ఆ వ్యక్తి ఉలికిపడి లేచాడు. ప్రకృతి బాగా చల్లబడిపోయింది. సూర్యబింబం నిప్పు ముద్దవలె పశ్చిమాద్రిని చేరబోతున్నది. పక్షులు గుంపులు గుంపులుగా ఎగిరిపోతూ రొద చేస్తున్నాయి. పశ్చిమదిశ ఎర్రని కాంతితో శోభాయమానంగా ఉంది.

అతడు మళ్లీ ఆ పేరువంకనే చూశాడు. క్రింద మెట్టుమీద 'సుంకాశేషు' అని మరొక పేరు ఉంది. అతడు లేచి దిగివొస్తూ "ఈ మెట్లు చెక్కించినవారు భక్తులను అంచె లంచెలుగా భగవంతుడికి దగ్గరగా చేస్తున్నారు. అందువల్ల వారికి సంక్రమించే పుణ్యలేశం వారిని యీ జనన మరణ క్లేశాలనుంచి యీపాటికి తప్పించే ఉంటుంది. వారిని ఎవరూ గుర్తించకపోయినా వారు ధన్యులే" అనుకున్నాడు. ★

---

ఒక ఎలిమెంటరీ స్కూల్‌లో బలిచక్రవర్తి నాటకం జరుగుతోంది.

వామనుడు:- "దానవరాజా! ఓ, బలిచక్రవర్తీ! ఒక అడుగుతో భూమిని, రెండవ అడుగుతో ఆకాశాన్ని అందుకొన్నా, ఇక మూడవ అడుగు ఎక్కడ వుంచేది?"

బలి:-(తన వ్రేలితో శుక్రుని తలను చూపి) "అక్కడ యుంచండి..."

వామనుడు:- "ఓరే! వాసూ! వానితలపై గాదురా! నీ తలపై పేరా! కావలనంటే మన పిలక టీచర్ను అడుగు.

టి. హరనాథ్ (పుంగనూరు)

---